ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలి



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర ఆటో రిక్షా కార్మికులకు సూచించారు. శనివారం 8వ డివిజన్‌లోని సిరి ఎంక్లేవ్, 9వ డివిజన్‌లోని భారత్‌నగర్ కాలనీ, 10వ డివిజన్‌లోని హెచ్‌ఎంబీఎస్ కాలనీలలో చెత్త సేకరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలు ప్రతిరోజూ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు తమ ఇంట్లోని చెత్తను అందించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు యాదగిరి, జగన్‌మోహన్ రావు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్



మణికొండ: బీఆర్‌ఎస్ పార్టీ తరఫున గత మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొంది పూర్తి కాలం అందులోనే కొనసాగిన మాజీ కౌన్సిలర్ శనివారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మణికొండ మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేసిన వసంతరావు చౌహాన్ గతంలో ఎమ్మెల్యే సమక్షంలోనే బీఆర్‌ఎస్ పార్టీలో పనిచేశారు. ఇటీవల ఎమ్మెల్యే పార్టీ మారినా అతను అందులోనే కొనసాగాడు. శనివారం ఎమ్మెల్యేతో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి. మల్లేష్, నాయకులు కె.రామకృష్ణారెడ్డి, యాలాల నరేష్, సురేష్‌గౌడ్, బి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చిత్రపురి సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీలో పర్యటించిన నరేందర్‌రెడ్డి తదితరులు

మణికొండ: చిత్రపురి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన కాలనీలో పర్యటించి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాలనీలో పార్కు, కమ్యూనిటీ హాల్ తదితర పనులను పూర్తి చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, నాయకులు సి. బీరప్ప, రాజేశ్, శ్రీనివాస్, కేశవరెడ్డి, మహేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: గగన్‌పహాడ్ సెక్షన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. త్రిషుల్ మెటల్ ఫీడర్, రవిఫుడ్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సర్వీసింగ్ గల్లీ, రవి ఫుడ్స్ ఇండస్ట్రియల్ ఏరియా, రామ్‌చరణ్ ఆయిల్ మిల్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

వైభవంగా పల్లకీ సేవ



చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట చెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారి పల్లకీ సేవ ఊరేగింపుతో స్థానికంగా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిచింది. బ్యాండ్ మేళాలు, విద్యుద్దీపాల నడుమ పురవీధుల్లో కొనసాగిన ఈ ఊరేగింపులో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎ.మహేష్ గౌడ్, కమిటీ సభ్యులు బి.వందన, విజయలక్ష్మి, శ్రీధర్, శైలేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేష్ ముదిరాజ్‌తో పాటు అశోక్ ముదిరాజ్, రాజు ముదిరాజ్, ప్రమోద్ కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ట్రాఫిక్ సిగ్నల్స్

'సాక్షి'కథనానికి స్పందించిన అధికారులు • తీరనున్న ప్రయాణికుల ఇబ్బందులు



ట్రాఫిక్ సిగ్నళ్ల మరమ్మతులు చేపట్టిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



మైహోం అవతార్‌లో ప్రారంభించిన ట్రాఫిక్ సిగ్నల్‌లు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఇబ్బందులు తీరనున్నాయి. సిగ్నల్స్ ఏర్పాటు చేసి వాటి ప్రారంభోత్సవం విషయం పట్టించుకోని విషయాన్ని 'సాక్షి'దినపత్రిక 'ప్రారంభమెప్పుడో..?'అనే శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్ పోలీసు విభాగం అధికారులు వెంటనే స్పందించారు. వాటికి అవసరమైన రిపేర్లు చేపట్టి ట్రయల్ రన్‌ను శనివారం ప్రారంభించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఔటర్ సర్వీసు రోడ్డులోని మై హోం అవతార్ సర్కిల్, ల్యాంకో హిల్స్ జీ సర్కిల్‌లలో ప్రతిరోజూ వందల నుంచి వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సదరు సర్కిళ్లలో సిగ్నల్స్ లేక పోవటంతో పలుమార్లు ప్రమాదాలు జరిగాయి. వాటిని దృష్టిలో పెట్టుకునే కొన్ని నెలల క్రితం సిగ్నళ్లను ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభించి ప్రజల ఇబ్బందిని తీర్చాల్సిన అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోలేదు. అదే విషయాన్ని 'సాక్షి'కథనం ప్రచురించటంతో రెండు సర్కిళ్లలో ట్రాఫిక్ సిగ్నల్‌లకు అవసరమైన మరమ్మతులు చేపట్టారు. మై హోం అవతార్ సర్కిల్‌లో వెంటనే ట్రయల్ రన్‌ను ప్రారంభించారు. ల్యాంకో జీ సర్కిల్‌లో సిగ్నళ్లలో సాంకేతిక సమస్య రావటంతో వాటిని మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. మరి కొన్ని చోట్ల త్వరలోనే ట్రాఫిక్ సిగ్నల్‌లను ఏర్పాటు చేస్తామని, ట్రాఫిక్ సమస్యల నివారణకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ సందర్శన

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను బిహార్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ బృందం శనివారం సందర్శించింది. సంస్థ స్వయం సహాయక సంఘాల విధి విధానాలు తెలుసుకుని అవగాహన కల్పించేందుకు బిహార్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ సంస్థ స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ సంజయ్ మిశ్రా బృందంతో కలిసి సందర్శించారు. రంగారెడ్డి జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్లీశ్వరి పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా మహిళా సంఘాల విధివిధానాలు సందర్శకులకు వివరించారు. అనంతరం మెప్మా, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు స్వయం ఉపాధిలో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో ఇంట్లో తయారు చేసిన వివిధ తినుబండారాలు, హ్యాండ్ మేడ్ వస్తువులు పరికరాలు, వాటి నిర్మాణ ప్రక్రియను కమిషనర్ బి.శరత్‌చంద్రతో కలిసి పరిశీలించారు. నూతన సంఘాల ఏర్పాటు, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళా సాధికారిత, స్వయం ఉపాధితో ఆర్థిక బలోపేతం వంటి విషయాలను ఈ సందర్భంగా కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మిషన్ కోఆర్డినేటర్లు ప్రసన్న, పద్మ, రేష్మి, టీఎంసీఎస్ శ్రీలత, ఏడీఎంసీలు ఉమేష్, అశోక్, ఆర్‌పీలు, స్వయం సహాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రతినిధులు

నియామకం



నియమాకపత్రాన్ని అందుకుంటున్న ఝాన్సీరెడ్డి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఝాన్సీరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి గౌడ్ ఝాన్సీరెడ్డికి నియమాకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ..రాజేంద్రనగర్ డివిజన్‌లో మహిళా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు అందరి సమష్టి కృషితో డివిజన్‌లో పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. ఎంతో నమ్మకంతో డివిజన్ అధ్యక్షురాలిగా నియమించినందుకు అధ్యక్షురాలితో పాటు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చికెన్, కోడి గుడ్ల వినియోగంపై అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: పౌల్ట్రీ బ్రీడర్స్ కో ఆర్డినేషన్ అసోసియేషన్, జాతీయ కోడిగుడ్ల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓల్డ్ అల్వాల్, బోయిన్ పల్లి, నాంపల్లి, అత్తాపూర్, సరూర్ నగర్, హయత్‌నగర్, మన్సూరాబాద్, మొయినాబాద్ ప్రాంతాల్లో 'చికెన్-కోడిగుడ్ల మేళా' నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్ పై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగిస్తూ చికెన్ వంటకాలు, ఉడికించిన కోడి గుడ్లను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 70 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద బర్డ్ ఫ్లూ వైరస్ చనిపోతుందని వెల్లడించారు. అలాంటిది మన భారతదేశంలో 100 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ వేడిలోనే వండుతారని, దీనివల్ల ఏ ప్రమాదం ఉండదని అవగాహన కల్పించారు.

ఆస్తిపన్ను పరిష్కార వేదికలో ఐదు ఫిర్యాదులు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఆస్తిపన్ను పరిష్కార వేదికలో ఐదు ఫిర్యాదులు అందినట్లు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవి కుమార్ తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన కార్యక్రమంలో ఆస్తిపన్ను తగ్గింపు కోసం ఐదు రివిజన్ పిటిషన్‌లను స్వీకరించడం జరిగిందన్నారు. ఇందులో రెండు సరైనవిగా గుర్తించడం జరిగిందన్నారు. మరో మూడు పిటిషన్‌లను ఫీల్డ్ వెరిఫికేషన్ కోసం పంపడం జరిగిందన్నారు. ఈ పిటిషన్లను మరో పరిష్కార వేదిక కార్యక్రమానికి ముందుగానే పరిష్కరించడం జరుగుతుందన్నారు.

గురుకులాల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాల భవనం

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకులాలలో ప్రవేశాల కోసం నిర్వహించే 'కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2025' నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2025-26 విద్యా సంవత్సరంలో గురుకులాలలో ప్రవేశాల కోసం ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి ఆనుకొని ఉండే గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాల, బాలుర కళాశాల(టీజీఎస్‌ఆర్‌జేసీ-బీ-నీట్,ప్రెప్ అకాడమీ)ల్లో ప్రవేశ పరీక్షా కేంద్రాలను ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. ముఖ్యంగా 5వ తరగతిలో ప్రవేశాలు, అంతేకాకుండా 6,7,8,9వ తరగతుల్లో ప్రస్తుతం ఖాళీ ఉండే సీట్ల కోసం కూడా పరీక్షను ఒకేసారి నిర్వహించడంతో ఏర్పాట్లు భారీగా చేస్తున్నారు. ఈ పరీక్షా కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు ఫోన్ ద్వారా పరీక్షా కేంద్రాలకు చేరుకునే వివరాలను కూడా అధికారులు, ఉద్యోగులు అందించారు. పరీక్షా కేంద్రంలో సౌకర్యాల కల్పనపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి పర్యవేక్షిస్తున్నారు. పరీక్షా సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. రిజ్వాన్ కాలనీకి చెందిన సయ్యద్ తాహేర్(64)కు కొంత కాలంగా మతిస్థిమితం సరిగా ఉండకపోవడంతో కుటుంబసభ్యులు స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. దుకాణానికి వెళ్లి బీడీలు తెచ్చుకుంటానని చెప్పి బయటకు వెళ్లిన తాహేర్ ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసిన ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాట్యం.. శోభితం



మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం తిల్లాన ఆర్ట్స్ అకాడమీ నాట్య గురువు మాధవి మారేళ్లపూడి శిష్య బృందం చే ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. గణపతి కౌతం, జతిస్వరం, ఇందరికి భయం ఇచ్చు చేయి, మల్లారి, తిల్లాన తదితర అంశాలను కళాకారులు ఆరాధ్య, స్వర, వీరింద, దియా, శ్రీనిక, లోహిత, వేదశ, ఇషితా, సన్నిది, సహస్ర ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

–మాదాపూర్

ఉన్నత విద్యలో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి

గోల్కొండ: ఉన్నత విద్యలో పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్.మూర్తి అన్నారు. శనివారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రిసర్చ్ అండ్ ఇన్నోవేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉన్నత విద్య చదివిన విద్యార్థులు ఎంటర్ ప్రినేటర్లుగా మారడానికి నవ్యత, పరిశోధన ఎంతగానో అవసరం అన్నారు. విద్యార్థుల సమగ్ర ఎదుగుదల, పరిశోధనలో మహిళల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఐబీఎంకు చెందిన శశాంక వాలేటీ, మన్‌కీ సీఈవో త్రిభువన్, ప్రొఫెసర్ మురళీకృష్ణ, డాక్టర్ రాజీకిరణ్, డాక్టర్ ముత్యాల శరత్, విండ్ స్ట్రీమ్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకటకుమార్ తంగిరాళ్ల, డాక్టర్ శాశ్వత్ పాటక్, జీఎన్‌ఐటీఎస్ ఉపాధ్యక్షురాలు జి.శ్రీవిద్యారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కిస్మత్‌పూర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శనివారం సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. వివిధ వార్డులలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, ఎల్‌ఆర్‌ఎస్ సర్వే, అడ్వర్ టైస్మెంట్ పన్నుల వసూలు, స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో భాగంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్, అన్-అస్సెస్ట్, అండర్ అస్సెస్ట్, నూతన సంఘాల ఏర్పాటు, ఇందిరా మహిళా శక్తి స్కీమ్, వివిధ టార్గెట్స్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి ఆయన పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సమావేశంలో మేనేజర్ ఈ.మంజులత, ఆర్‌ఓ కె.శివకుమార్, వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, రిసోర్స్ పర్సన్స్(ఆర్‌పీలు), శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

వలస కార్మికుల సమస్యలపై పోరాడతాం



మాట్లాడుతున్న పానుగంటి పర్వతాలు

శంషాబాద్: వలస కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ పోరాటాలు కొనసాగిస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వలస కార్మికుల భద్రతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేట్ నిర్మాణ రంగాల వద్ద వేలాది మంది వలస కార్మికులు పనిచేస్తున్నా ఎలాంటి భద్రత చర్యలు ఉండడం లేదన్నారు. అనేక ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు కూడా తరచూ చోటు చేసుకుంటున్నాయన్నారు. లేబర్ అడ్డాల వద్ద మౌలిక వసతులు కూడా సర్కారు సమకూర్చడం లేదన్నారు. అనేక సమస్యల పరిష్కారినికి ఏఐటీయూసీ ముందుండి పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రామస్వామి, సామిడి శేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్, కేతరాజు, నర్సింహ, నగ్రగిరి రాములు, నరసింహా, రాజు, అశోక్, రామచంద్రయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటర్ కాలేజీ క్రీడలు ప్రారంభం



బ్యాట్ అందజేస్తున్న డీసీపీ శ్రీనివాస్‌రావు

ఏజీవర్సిటీ: క్రీడా పోటీలు వ్యాయామంతో సమానమని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్. శ్రీనివాస్‌రావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు పశు వైద్యశాలలో ఇంటర్ కాలేజీ క్రీడలు సాహితీ, సాంస్కృతిక పోటీలు ప్రారంభమయ్యాయి. వీటిని డీసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల్లో పోటీతత్వం ఉన్నప్పుడే మనం నిర్దేశించుకున్న లక్ష్యాలన్ని చేరుకోగలమన్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ..క్రీడలతో వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, టీం వర్క్, మానసిక ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. రాజేంద్రగనర్, మామునూరు, కోరుట్ల, కామరెడ్డి, పెబ్బేరు కళాశాలల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లిలో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం శనివారం వైభవంగా జరిగింది. కొత్తగా నిర్మించిన ఆలయంలో అయ్యప్ప స్వామితో పాటు కుమారస్వామి, గణపతి దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ధ్వజస్తంభం, విగ్రహాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో మూడు రోజులుగా హోమాలు, పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు, అయ్యప్ప మాల ధరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

శంషాబాద్: ఇరు కుటుంబాలు అంగీకరించకపోవడంతో ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్న ఓ ప్రేమజంట శుక్రవారం రాత్రి ఆర్‌జీఐఏ పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఇరు కుటుంబాలు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దగొల్కొండ గ్రామానికి చెందిన యువకుడు డబీల్‌గూడ గ్రామానికి చెందిన యువతి ఇద్దరు మేజర్లు ప్రేమించుకున్నారు. ఇరువైపు పెళ్లికి అంగీకారం లేకపోవడంతో శుక్రవారం ఉదయం ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. రక్షణ కోసం శంషాబాద్ ఏసీపీని కలిసేందుకు ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఇరు కుటుంబాలు ఆగ్రహంగా ఉండడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. అమ్మాయి మిస్సింగ్ కేసు మహేశ్వరం పీఎస్ పరిధిలో ఉండడంతో ప్రేమజంటను అక్కడికి తరలించేందుకు యత్నించినప్పటికీ పరిస్థితి సరిగా లేకపోవడంతో యువతిని సఖీ కేంద్రానికి పంపారు. యువకుడిని తండ్రి వెంట పంపడంతో పరిస్థితి సద్దుమణిగింది.

భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా



లక్ష్మిగూడలోని భర్త శివ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న లహరి

మైలార్‌దేవ్‌పల్లి: వివాహం చేసుకున్నప్పటి నుంచి వేధింపులకు గురి చేస్తున్నాడని భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళనకు దిగింది. ఈ ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మిగూడలో శనివారం ఉదయం జరిగింది. జియాగూడకు చెందిన శివకు లహరితో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. ఆ తర్వాత కొద్ది రోజులకే శివ మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. వేధింపులు భరించలేక లహరి ఆరు నెలల క్రితం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. కేసు పెట్టిందనే కోపంతో భర్త, అత్త లహరిని ఇంట్లో నుంచి గెంటేశారు. అప్పటి నుంచి లహరి తల్లిగారి ఇంటి వద్దే ఉంటుంది. నెలలు గడుస్తున్నా భర్త తనను తీసుకెళ్లకపోవడంతో శనివారం ఉదయం లహరి..తల్లిదండ్రులు, అన్న వదినలతో కలిసి వచ్చి శివ ఇంటి ఎదుట బైఠాయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్‌లు దోహదం

మైలార్‌దేవ్‌పల్లి: నేరాల నియంత్రణకు కార్డన్ సెర్చ్‌లు దోహదపడుతాయని రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాటేదాన్, దుర్గానగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ నరేందర్‌తో కలిసి కార్డన్ సర్చ్‌లో పాల్గొన్నారు. ఈ కార్డన్ సర్చ్‌లో పబ్లిక్ ప్లేస్‌లో మద్యం సేవిస్తున్న 15 మందిపై కేసులు నమోదు చేశారు. అలాగే ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న నాలుగు వాహనాలను, సరైన దస్తావేజులు లేని నాలుగు ద్విచక్ర వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..నేరాలను నియంత్రించేందుకు ఎప్పటికప్పుడు కార్డన్ సర్చ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్స్, గంజాయి, నిషేధిత గుట్కాలను విక్రయించే, సేవించే వారిపై గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ నరేందర్